సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 13 । జూలై । 2023



ఎంతగానో ఆకట్టుకున్నాయి

గిరిజన మ్యూజియంలో కళాకృతులు ఆకట్టుకున్నాయని పార్లమెంట్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ పేర్కొంది. 8లో



గంజాయిని నిర్మూలిద్దాం

గంజాయి, ఇతర మత్తు పదార్థాలను కలిసికట్టుగా నిర్మూలిద్దామని చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్ పిలుపునిచ్చారు. 8లో



తెగుళ్లపై అవగాహన అవసరం

వరి నారుమడులకు ఆశించే తెగుళ్లపై రైతులు అవగాహన పొందాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. 8లో

న్యూస్‌రీల్

జగనన్న సురక్ష విజయవంతం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- 4,955 ధ్రువపత్రాల పంపిణీ

సాక్షి,పాడేరు: జిల్లాలోని 17సచివాలయల పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం శిబిరాలు విజయవంతమయ్యాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.12,883 గృహాల్లో వలంటీర్లు ఇంటింటా సర్వేజరిపి, వివిధ ధ్రువపత్రాల నిమిత్తం 12,883 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారన్నారు.వీటిలో 13 దరఖాస్తులు తిరస్కరించగా, 4,955 ధ్రువపత్రాలను పంపిణీ చేశారన్నారు. మిగిలిన 7,915 ధ్రువపత్రాలను రెండు రోజుల్లోగా ఆయా సచివాలయాల్లో పంపిణీని పూర్తిచేస్తారని కలెక్టర్ తెలిపారు.

నేడు జగనన్న సురక్ష శిబిరాలు

జిల్లాలోని 17 సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.అనంతగిరి మండలంలోని కొండిబ, కాశీపట్నం, అరకులోయలో లోతేరు, సుంకరమెట్ట, చింతూరు మండలంలోని చిదుమూరు,డుంబ్రిగుడ మండలంలోని బొసువలస,కొర్రాయి.జి.మాడుగుల మండలంలోని కోరాపల్లి, పెదలువ్వాసింగిలిలో జరుగుతాయన్నారు. కూనవరంలోని కొండరాజుపేట, ముంచంగిపుట్టు మండలంలోని కర్రిముఖిపుట్టు, కుమడ, ఎటపాక మండలంలోని రాయవనపేట, విస్సాపురం, పాడేరు మండలంలోని దేవాపురం, వంట్లమామిడి, వై.రామవరంలోని పి.యర్రగొండ సచివాలయాల్లో జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

పోలవరం నిర్వాసితులకు 15న గ్రామసభ

చింతూరు: పోలవరం ముంపులో భాగంగా ప్రాధాన్యత క్రమంలో చేర్చిన చింతూరులోని గిరిజన, గిరిజనేతర నిర్వాసితులకు ఈనెల 15న గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కారం సుబ్బారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన నిర్వాసితులకు పునరావాస ప్రక్రియలో భాగంగా ఆర్అండ్ఆర్ కాలనీల ఏర్పాటు, నిర్మాణంపై ఈ గ్రామసభలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. చింతూరు సంత మార్కెట్ మైదానంలో ఉదయం 10 గంటలకు గ్రామసభ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

82 మందికి వేసెక్టమీ ఆపరేషన్లు



ఆపరేషన్లు చేసుకున్న వారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పెదబయలు: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని 82 మందికి వేసెక్టమీ ఆపరేషన్లు చేయడం జరిగిందని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు ఆధ్వర్యంలో వ్యాసెక్టమీ ఆపరేషన్లు నిర్వహించారు. పెదబయలు పీహెచ్‌సీ పరిధిలో 60 మంది, గోమంగి పీహెచ్‌సీ పరిధిలో 22 మందికి ఆపరేషన్లు చేశారని డీఎంహెచ్‌వో తెలిపారు. మాత శిశుమరణాలు అరికట్టేందుకు ఆస్పత్రి ప్రసవాలకు రావాలని, కాన్పు తేదీ కంటే 15 నుంచి 20 రోజుల ముందుగానే ఆస్పత్రిలో గర్భిణులను చేర్పించాలని సూచించారు.వైద్యాధికారులు డాక్టర్ ఎం. చంద్రశేఖర్ చైతన్య, సింధూరం పడాల్, ఎస్‌వో కైలాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విధులపట్ల అలసత్వం తగదు

- విద్యాశాఖ ఆర్‌జేడీ జ్యోతికుమారి



జి.మాడుగులలోనాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

జి.మాడుగుల: పాఠశాలలో విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని విద్యాశాఖ ఆర్‌జేడీ జ్యోతికుమారి హెచ్చరించారు. మండలంలో పలు గ్రామాల్లో పాఠశాలలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కెకోడాపల్లి పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థులు పఠనా సామర్థ్యాన్ని, టీచర్ టీచింగ్ ప్లాన్‌ను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో నాడు-నేడు పనులను తనిఖీ చేశారు. పాఠశాలలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు అందిస్తున్న భోజన మెనూపై ఆమె ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీఈవో సలీంబాషా, డిప్యూటీ డీఈవో చెల్లయ్య, ఎంఈవో సీహెచ్ బాబూరావుపడాల్, హెచ్ఎం నాగేశ్వరరావు, ఇన్‌చార్జి హెచ్ఎం సుధారాణి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నిరసనల హోరు

గ్రామ వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం కూడా జిల్లాలో ఆందోళనలు కొనసాగాయి. అతనిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై గ్రామ వలంటీర్ల ధ్వజం
- చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు
- ఆందోళన మరింత ఉధృతం



పాడేరు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామ వలంటీర్లు



రాజవొమ్మంగిలో మానవహారంగా ఏర్పడిన వలంటీర్లు

సాక్షి,పాడేరు: ప్రజాసేవలో శ్రమిస్తున్న తమపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యాలు చేయడాన్ని నిరసిస్తూ గ్రామ వలంటీర్లంతా తమ ఆందోళనలను ఉధృతం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం గ్రామ వలంటీర్ల ఆందోళనలు కొనసాగాయి. పాడేరు డివిజన్ పరిధిలోని గ్రామ వలంటీర్ల సంఘం నేతలు జిల్లా కేంద్రమైన పాడేరులో నిరసన ర్యాలీ చేపట్టారు. ఖబడ్దార్ ప్యాకేజి స్టార్ అంటూ వలంటీర్లంతా నినాదాలతో ర్యాలీ హోరెత్తింది. పాడేరు ఐటీడీఏ కార్యాలయ ప్రాంతం నుంచి సినిమాహాల్ సెంటర్, పాతబస్టాండ్ మీదుగా పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. పవన్‌కళ్యాణ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని భేషరతుగా క్షమాపణ చెప్పాలని వారంతా డిమాండ్ చేసారు. పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.అనంతరం పవన్‌కళ్యాణ్‌పై వలంటీర్ల సంఘం నేతలు ఎస్ఐ లక్ష్మణరావుకు ఫిర్యాదు అందజేశారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు

గ్రామ,వార్డు వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు తగదని వలంటీర్ల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్ము సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ రూ.5వేల గౌరవ వేతనంతో వలంటీర్లంతా సమాజ సేవచేస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవ చేశామని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో పక్క రాష్ట్రానికి పారిపోయిన మీరు తమపై ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. ప్రజల ప్రాణాల కోసం వారధిలా పనిచేశామని, రాజకీయ లబ్ధికోసం వలంటీర్లపై తప్పుడు ఆరోపణలను చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పవన్‌కల్యాణ్ పై చర్యలు తీసుకునేంత వరకు తమ పోరాటం ఆగదని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వలంటీర్ల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్లు కొండబాబు,ముంచంగిపుట్టు, పాడేరు మండల అధ్యక్షులు గొల్లోరి దేవా,గబ్బాడ మహేష్,ఇతర నాయకులు దేవా,చిట్టిబాబు,గిరి,శోభన్,కొండమ్మ,చిన్నయ్య,హను తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై అడ్డతీగలలో బుధవారం గ్రామ వాలంటీర్లు నిరసన తెలిపారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లు తరలివచ్చి అడ్డతీగలలోని సీతపల్లి జెంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.సేవాభావంతో పని చేస్తున్న తమపై అనుచిత వ్యాఖ్యలు చేసి సమాజంలో చులకన చేస్తున్నట్లు మాట్లాడిన పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలని మండల గ్రామ వలంటీర్ల సంఘం అధ్యక్షుడు వంతల ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు.

తీరుమార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు

రాజవొమ్మంగి: సచివాలయ వ్యవస్థపై బురద జల్లడమే కాకుండా వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న పవన్ కళ్యాణ్ తన తీరుమార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని రాజవొమ్మంగి వలంటీర్లు ధ్వజమెత్తారు. ఈ మేరకు రాజవొమ్మంగి-1, రాజవొమ్మంగి-2 సచివాలయల్లో పని చేసే దాదాపు వంద మంది వలంటీర్లు ర్యాలీగా స్థానిక అల్లూరి కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడ పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మానవ హారంగా ఏర్పడ్డారు. ఆయన చిత్రపటాలను విసిరికొట్టి నిరసన తెలిపారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు వారికి బాసటగా నిలిచారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

సేవకులపై విమర్శలా..

డుంబ్రిగుడ: గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సేవ చేస్తున్న గ్రామ వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎంపీపీ బాక ఈశ్వరి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ తక్షణం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ వలంటీర్లందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్న పవన్ కల్యాణ్‌కు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆమె హెచ్చరించారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగదు

చింతూరు: సేవాగుణంతో సేవలందిస్తున్న తమపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని గ్రామ వలంటీర్లు మండిపడ్డారు. పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం స్థానిక మెయిన్‌రోడ్ సెంటర్లో వలంటీర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను కాళ్లతో తన్నుతూ అతని చిత్రాలను చించి వలంటీర్లు నిరసన తెలిపారు. వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కళ్యాణ్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని, వలంటీర్లను అసాంఘిక శక్తులుగా చిత్రీకరించిన అతనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తూ సేవా దృక్పథంతో పనిచేస్తున్న వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన అతని రాజకీయ అవివేకానికి నిదర్శనమని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. సర్పంచ్ ముచ్చిక నాగార్జున, పరిటాల సత్యనారాయణ, ఇల్లా మురళి, వలంటీర్లు మహేష్, ముత్తయ్య, శ్రీరాములు, సుమన్, రమాదేవి, కల్యాణి, అనూష, నాగమణి పాల్గొన్నారు.



పాడేరులో పవన్ కళ్యాణ్‌పై ఎస్ఐ లక్ష్మణరావుకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



రాజవొమ్మంగిలో ర్యాలీగా వెళ్తూ నిరసన తెలుపుతున్న గ్రామ వలంటీర్లు



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్లు



అడ్డతీగలలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



చింతూరులో నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

వలంటీర్లకు వందనం

ఇంటికి వచ్చి పింఛను ఇస్తున్నారు



ఫొటోలో ఈమె పేరు వి.లక్ష్మి. దివ్యాంగురాలు. ఎటపాక మండలంలోని గౌరిదేవిపేట స్వగ్రామం. గతంలో పింఛనుకోసం పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. జగనన్న వచ్చాక బాధలు తీరాయి. గ్రామ వలంటీరు ఇంటి వద్దకు వచ్చి పింఛను ఇస్తున్నాడని ఆమె ఎంతో సంతోషంగా తెలిపింది.

వలంటీర్ వల్లే అమ్మఒడి పొందగలిగా



ఈ ఫొటోలో బెడ్‌పై ఉన్న మహిళ పేరు లువ్వాబు నాగమణి. చింతపల్లి మండలం గోందిపాకలు పంచాయితీ బద్దిమెట్ట గ్రామానికి చెందిన ఈమె అనారోగ్యానికి గురై నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈకేవైసీ కానందున అమ్మఒడి అందుకోలేనేమో అనుకుంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ వనుము రాజు నర్సీపట్నం వెళ్లి ఆమెకు ఈకేవైసీ చెయించి అమ్మఒడి అందేలా చేశారు. దీనికి ఆమె ఎంతో సంతోషించి జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవన చక్కని వరమని పేర్కొంది.

క్షమాపణ చెప్పాలి



తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలి. ఉన్మాదిలా మాట్లాడుతున్న పవన్‌కు రానున్న కాలంలో గుణపాఠం తప్పదు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్యలో వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలు అందిస్తుంటే ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదు.

– **ఎస్.గోపాల్**, వలంటీర్, సొవ్వ, డుంబ్రిగుడ మండలం

దుర్మార్గపు వ్యాఖ్యలు



ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్న తమపై పవన్‌కల్యాణ్ దుర్మార్గపు వ్యాఖ్యలు చేయడం సరికాదు. అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి. గ్రామవలంటీర్లకు పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే.

– **బర్లు కొండబాబు**, వలంటీర్, గూడ, హుకుంపేట మండలం

సేవ చేస్తుంటే విమర్శలా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సేవా దృక్పథంతో పనిచేస్తున్నాం. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల గడప గడపకు చేరవేస్తున్నాం. పింఛనుదారులు ఎక్కడ ఉన్నా ఒకటో తేదీన నగదు అందజేస్తున్నాం. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న తమపై విమర్శలు చేయడం పవన్‌కల్యాణ్‌కు తగదు. – **సోడె అనిల్‌కుమార్**, గ్రామ వలంటీర్, చింతూరు

సంతోషంగా ఉన్నాం



రాజశేఖరరెడ్డి తనయుడు జగన్ వచ్చాక మాలాంటి పేదలంతా సంతోషంగా ఉన్నాం. బియ్యం, ఫించను, సర్టిఫికెట్లు అన్నీ వలంటీర్లు ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. ప్రతీ సమాచారం ఎప్పటికప్పుడు వలంటీర్లు ఇంటికి వచ్చి చెపుతున్నారు.మాకు ఇంత కంటే ఏమి కావాలి. మాపేదలకోసం మళ్లీ జగనే రావాలి.

– **తెల్లం జయ**, లబ్ధిదారు, నల్లకుంట, ఎటపాక మండలం

వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించాలి



నుర్మతి గ్రామంలో గిరిజన రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

- పోలీసు శాఖ ద్వారా అవసరమైన ప్రోత్సాహం
- ఎస్పీ తుహిన్‌సిన్హా
- పరివర్తన కార్యక్రమంలో గిరి రైతులకు మొక్కల పంపిణీ

జి.మాడుగుల: జిల్లాలో గిరి రైతులు వ్యవసాయంలో ఆర్థికాభివృద్ధి సాధించేలా ఉచితంగా మొక్కలు, విత్తనాలు అందజేసి ప్రోత్సహిస్తున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. మండలంలో నుర్మతిలో బుధవారం పరివర్తన కార్యక్రమంలో భాగంగా పోలీస్‌శాఖ, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సహకారంతో కిల్లంకోట, బొయితిలి, నుర్మతి పంచాయతీలకు చెందిన గిరిజన రైతులకు ఉచితంగా సిల్వర్‌ఓక్, నారింజ మొక్కలు, రాగులు విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరివర్తన కింద ఈ ప్రాంతంలో 2021సంవత్సరంలో 150 ఎకరాలు గంజాయి సాగును ధ్వంసం చేసినట్టు తెలిపారు. 2022లో గంజాయి సాగు పూర్తిగా వదిలి పోలీస్‌శాఖకు సహకరించినందుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నట్టు ఆయన తెలిపారు. పోలీస్‌శాఖ ద్వారా ఉచితంగా సిల్వర్‌ఓక్, రాజ్‌మా, పసుపు తదితర పంటలపై రైతులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ శాఖలకు సహకరిస్తే రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు ఒకదాని తరువాత ఒకటి అభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. గంజాయి, మావోయిస్టు వంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి పోలీస్‌శాఖకు సహకరించాలని ఆయన కోరారు. గంజాయి సాగు చేసి గ్రామానికి చెడ్డపేరు తెచ్చుకోవద్దని సూచించారు. గంజాయి సాగు, రవాణా సమాచారం పోలీసులకు తెలియజేయాలని కోరారు. సుమారు 150ఎకరాల రైతులకు 70వేల సిల్వర్‌ఓక్, 4వేల నారింజ మొక్కలు, రెండు పంచాయతీలకు 40 కిట్లు రాగుల విత్తనాలు పంపిణీ చేశారు. సీఐ సత్యనారాయణ, సీఆర్‌పీఎఫ్ 198బిన్ టీసీ ఉదయ్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖాధికారి నందు, జిల్లా హార్టికల్చర్ అధికారి రమేష్, ఉపాధి హామీ పథకం డీపీవో రంగరావు, ఏవో పాత్రుడు, ఎంపీటీసీ ఎల్.అప్పలరాజు, సర్పంచ్‌లు ముత్యాలమ్మ, లసింగి మాలన్న, సూరిబాబు సచివాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాల్సైట్ మైనింగ్ లీజును రద్దు చేయాలని వినతి



ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

అనంతగిరి: మండలంలోని వాలసీ పంచాయతీ నిమ్మలపాడులోని ఏపీఎండీసీ కాల్సైట్ మైనింగ్‌ను, గతంలో బినామీపేర్లతో ఇచ్చిన లీజులు రద్దుచేసి స్థానిక సొసైటీకి లీజు బాధ్యతలు అప్పగించాలంటూ నిమ్మలపాడు, రాళ్లవలస, కరకవలస గ్రామాల గిరిజనులు కోరారు. బుధవారం గడప గడప కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు వారు వినతిపత్రం అందజేశారు. వేరే వ్యక్తులకు లీజులు ఇవ్వడంతో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరగడం లేదన్నారు. ఇరవై ఏళ్లగా ఇదే పరిస్థితి నెలకొందని, స్థానిక గిరిజనుల సొసైటీకి ఏపీఎండీసీ మైనింగ్ లీజులు అప్పగిస్తే నష్టపోతున్న రైతులకు, గిరిజనులకు మేలు జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, వైస్ ఎంపీపీ దూరు జయవర్థిని, సర్పంచ్ సన్యాసిరావు, మాజీ సర్పంచ్ స్వామి పాల్గొన్నారు.

ఆర్ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



రాజారావు

చింతపల్లి రూరల్: చింతపల్లి ప్రభుత్వ ఆర్ ఐటీఐలో మిగులు సీట్లకు సంబంధించి రెండవ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ప్రిన్సిపాల్ రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పని వేళల్లో ఒరిజనల్ ధ్రువపత్రాలతో చింతపల్లి ప్రభుత్వ ఆర్ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల 3వ తేదీన కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9866108607, 9494377833 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

‘సరిహద్దు’ సమస్య పరిష్కారానికి చర్యలు

రాయిపాడును సందర్శించిన ఇరు రాష్ట్రాల అధికారులు



ఆంధ్రా-ఒడిశా సరిహద్దులను పరిశీలిస్తున్న ఇరు రాష్ట్రాల అధికారులు

డుంబ్రిగుడ: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని రాయిపాడు గ్రామాన్ని ఒడిశా సబ్‌కలెక్టర్ బెనుదొరాబొరో, ఆంధ్రా నుంచి డుంబ్రిగుడ తహసీల్దార్ నాగమ్మ, అధికారుల బృందం బుధవారం సందర్శించింది. గ్రామ సరిహద్దులను పరిశీలించింది. అనంతరం ఈ గ్రామం ఏ రాష్ట్రానికి చెందినదిగా గుర్తించాలనే అంశంపై చర్చించారు. ఇరు రాష్ట్రాల నుంచి కూడా సంక్షేమ పథకాలు పొందుతున్నారని అలాగే రేషన్ కార్డులు ఉచిత బియ్యం వంటి పథకాలు కూడా పొందుతున్నారని సమాచారంపై విచారణ జరిపారు. సరిహద్దు సమస్యలు పరిష్కరించేంతవరకు ఇరు రాష్ట్రాల నుంచి సంక్షేమ పథకాలను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగమ్మ మాట్లాడుతూ ఈ రోజు చర్చించిన అంశాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. రెవెన్యూ అధికారులు ఎస్ఐ సంతోష్‌కుమార్, సర్పంచ్ హరి, వైస్ ఎంపీపీ ఆనందరావు, ఒడిశా తహసీల్దార్ నర్సింగ్ గదబ్బ, బీడీవో నోరోక్ మిశ్రా పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెగుళ్లపై అవగాహన అవసరం

- వరి రైతులకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల సూచన

సాక్షి, పాడేరు: వరి నారుమడులకు ఆశించే తెగుళ్లపై రైతులు అవగాహన పొందాలని పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. బుధవారం మండలంలోని మినుములూరు సచివాలయం పరిధిలోని కరకపుట్టు, బంద పాలెం గ్రామాల్లో ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ జె.జగన్నాథం,డాక్టర్ చిట్టిబాబు,డాక్టర్ పి.వెంకటరావు పర్యటించారు. వరి నారుమడులను పరిశీలించారు. నారుమడుల తయారీలో మెలకువలపై గిరి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిపంటలో తెగుళ్లు ఆశించకుండా సుడోమోనాస్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం చాలావరకు నారుమడుల్లో సూక్ష్మ పోషక లోపాలు గుర్తించినట్టు తెలిపారు. నారుమడులు ఆరోగ్యకరంగా ఎదిగేంత వరకు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, పశువుల బెడద లేకుండా చూసుకోవాలన్నారు. ఆలస్యంగా వరినాట్లు చేపట్టే రైతులు డ్రమ్‌సీడర్‌తో విత్తుకోవాలని సూచించారు. అలాగే రాగులు సాగు చేసే రైతులకు కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు విజయలక్ష్మి, సూర్యకుమారి, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొయ్యూరు: ఆడాకులలో పట్టుకున్న రెండు ఇసుక ట్రాక్టర్లకు నిబంధనలు అనుసరించి ఒక్కో దానికి రూ.10వేల జరిమానా వేసినట్టు సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐ రాజారావు బుధవారం తెలిపారు. తమకు వచ్చిన సమాచారం ఆధారంగా ఆడాకుల వెళ్తున్న ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. వాటిని స్టేషన్‌కు తరలించి జరిమానా వేశామన్నారు. అనుమతులు లేకుండా ఎవరు ఇసుక తరలించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వెయ్యి లీటర్ల సారా పులుపు ధ్వంసం



సారా బట్టీలో ఉన్న సామగ్రిని ధ్వంసం చేస్తున్న జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్

రాజవొమ్మంగి : మండలంలోని లోతట్టు అటవీప్రాంతంలో జడ్డంగి పోలీసులు ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలో దాడి జరిపి సారా బట్టీని ధ్వంసం చేశారు. ఆ ప్రాంతంలో రహస్యంగా నిల్వ చేసిన వెయ్యి లీటర్ల బెల్లం ఊటను నేలపాలు చేశారు. సారా తయారీ కోసం ఉపయోగించే సామగ్రి, కుండలు, ప్లాస్టిక్ పీపాలను పగులగొట్టామని ఎస్ షరీఫ్ తెలిపారు. ఏరియా డామినేషన్ ప్రక్రియలో భాగంగా లోతట్టు అటవీప్రాంతంలో క్యూంబింగ్ చేస్తుండగా ఈ సారా బట్టీ వెలుగులోకి వచ్చిందన్నారు. కాగా బట్టీ నిర్వాహకులు పరారయ్యారన్నారు.

మెరుగైన రవాణా సౌకర్యాలే లక్ష్యం



పాడేరులో రోడ్ల అభివృద్ధిపై సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



చాపరాయిని పరిశీలిస్తున్న పీవో అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ



హుకుంపేటలో ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం నిధులు రూ.57 కోట్లతో పాడేరు ప్రధాన రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. మంగళవారం రాత్రి పాడేరు పట్టణంలోని మెయిన్‌రోడ్డు, పాతబస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఆయన బుధవారం పర్యటించారు. రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు సంబంధించి, ఈఈ బాల సుందరబాబుతో సమీక్షించారు. ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణకు సేకరించిన స్థలాలను పివో పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో అభిషేకర్ మాట్లాడుతూ ప్రయాణికులకు నడకదారి, పార్కింగ్ సౌకర్యాలు,రోడ్డు అభివృద్ధి,మురిగికాల్వల నిర్మాణాల నిమిత్తం ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగిస్తున్నామన్నారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టిరోడ్డులో టైల్స్ వేసి, ఆధునీకరిస్తామన్నారు. ప్రధాన రోడ్డుపై వర్షం నీరు నిల్వలేకుండా రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకంలో మెటల్ కాంపోనెంట్ కింద పాడేరులో రోడ్డు విస్తరణ చేస్తున్నామన్నారు. ఆర్అండ్‌బీ, విద్యుత్ పంపిణీ సంస్థ, ట్రాన్స్‌కో అధికారుల నుంచి కూడా రోడ్డు విస్తరణ నివేదికలు సేకరిస్తున్నామన్నారు. పట్టణంలోని దుకాణాదారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు ఆధునీకరణ పనులు చేస్తామన్నారు. పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రోడ్డు మధ్యలో డివైడర్ పెట్టడానికి రోడ్డు ఇంకా వెడల్పు కావల్సి ఉంటుందన్నారు. హుకుంపేట, అరకులోయలలో మాదిరిగానే పాడేరుకు బైపాస్ రోడ్డు నిర్మిస్తామన్నారు. జాతీయ రహదారికి సంభదించి జి.మాడుగుల మండలం పెదకోల్తార్, హుకుంపేట మండలం పెదగరువు వద్ద టోల్‌గేట్లు నిర్మిస్తామని పీవో తెలిపారు.

చాపరాయి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్ర మైన చాపరాయి జలపాతం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. మండల కేంద్రంలో ప్రముఖ చాపరాయి జలపాతాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్, అసిస్టెంట్ అశుతోష్ శ్రీవాత్సవతో కలిసి బుధవారం సందర్శించారు. ఇక్కడ రూ.25లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి వస్తున్న పర్యాటకులకు తిలకించుందుకు అనుకులంగా ఉండేందుకు జలపాతం ముఖద్వారాన్ని రాజస్థాన్ కళాత్మకత ఉట్టిపడేలా సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. స్టాల్స్ ఏర్పాటుచేసి చిరువ్యాపారులకు ఉపాధి కల్పిస్తామన్నారు. మూడు నెలల కాలంలో చాపరాయిని అభివృద్ధి చేస్తామన్నారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. టీడబ్ల్యూ ఏఈ అభిషేక్, తహసీల్దార్ నాగమ్మ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ నాయకుడు సురేష్ తదితరులున్నారు.

మెను అమలు చేయకపోతే చర్యలు తప్పవు

హుకుంపేట: ఆశ్రమ పాఠశాలలో మెను సక్రమంగా అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. మజ్జివలస గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల మెనూ పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు సాంఘిక శాస్త్రం, గణితం సబ్జెక్టులలోని మొదటి పాఠ్యాంశంలోని పలు ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసి, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. మెను సక్రమంగా అమలు చేయలేదని, విద్యార్థుల నూరు శాతం హాజరు లేదని ప్రదానోపాధ్యాయుడు టి.నాగేశ్వరరావుకు షోకాజ్ నోటీసు జారీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులు నేటికీ ఆశ్రమ పాఠశాలకు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జేవీకే కిట్ల పంపిణీపై ఆరా తీశారు. విద్యార్థులకు యూనిఫారం పంపిణీ చేసినా, కుట్టించుకుని వేసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. యూనిఫారమ్ ధరించాలని సూచించారు. వంటగదిని పరిశీలించి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట ఏటీడబ్ల్యూవో రజని తదితరులున్నారు.

'లుభర్తి' గర్భంలో ఆక్రమణలు తొలగిస్తాం

- జలాశయ ఆయకట్టుదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



ద్రవీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీపీ రమేష్ తదితరులు

కొయ్యూరు: రెండు వేల ఎకరాలకు సాగునీరు అందించే లుభర్తి జలాశయ గర్భం ఆక్రమణకు గురి కావడం వల్ల ఆయకట్టుకు నీరు అందని పరిస్థితి తలెత్తుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు.బుధవారం ఎం మాకవరం సచివాలయం పరిధిలో నిర్వహించిన సురక్ష కార్యక్రమానికి హాజరయ్యారు. సర్పంచ్ కోడా చింతల్లి, భర్త రాజుబాబు మాట్లాడుతూ లుబ్బర్తి జలాశయ గర్భం కొన్నేళ్లుగా ఆక్రమణలకు గురవుతుందన్నారు. వీటికి పట్టాలిచ్చేందుకు రెవెన్యూ అధికారులు చూస్తున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రెండు వందల ఎకరాల విస్తీర్ణానికి మంచి ఉండే జలాశయ గర్భం కుదించుకుపోయిందన్నారు. దీనివల్ల నిల్వ సామర్థ్యం తగ్గి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందని పరిస్థితి ఉందన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్రమించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారులను కోరతామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఎం మాకవరం పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని నియమిస్తామన్నారు. నడింపాలెం నుంచి ఎం మాకవరం వరకు మెటల్ వేశారని, త్వరలో బీటీ కూడా వేయించేందుకు వీలుగా కాంట్రాక్టర్‌తో మాట్లాడినట్టు చెప్పారు. పూర్తికానున్న సచివాలయ భవనాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వలంటీర్ వ్యవస్థపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్న పవన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. జెడ్పీటీసీ వారా నూకరాజు మాట్లాడుతూ పవన్ సినిమా డైలాగులు ఇక్కడ చెబితే చెల్లవన్నారు. ప్రజలే ఆయన చొక్కా పట్టుకునే రోజులు వచ్చాయన్నారు. ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ టీడీపీ నాయకులు ప్రతీ దానిని రాజకీయం చేయడం తగదన్నారు. ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ మాట్లాడుతూ టీడీపీ నేతలు వారి బుద్ధి మార్చుకోవడం లేదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతూనే మరోవైపు విమర్శలు చేస్తున్నారన్నారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, కన్వీనర్ బండి సుధాకర్, సర్పంచ్‌లు సెగ్గే రమాదేవి, ఎస్ సోమన్నదొర, కోడా చింతల్లి, ఎంపీటీసీలు పాడుతు రత్నం, బి.అప్పారావు, కె మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు

- 90 లక్షల పనిదినాలు పూర్తి
- మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ రమేష్ రామన్



పైడిపనుకులలో చెరువును పరిశీలిస్తున్న డ్వామా పీడీ రమేష్ రామన్

కొయ్యూరు: అర్హులందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నామని డ్వామా పీడీ రమేష్ రామన్ అన్నారు. మంప పంచాయతీలో తుమ్మలబంధ, పైడిపనుకులు, మంప గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.15 చెరువులను మంప పంచాయతీలో తవ్విస్తున్నామన్నారు. ఈ యేడాది కోటి 20లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు 90 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. మిగిలినవి కూడా పూర్తవుతాయని తెలిపారు. అనుసంధానం అయిన 1, 50,000 కుటుంబాలకు ఉపాధి పనులు అదనంగా 50 రోజులు చేసుకునేందుకు అవకాశం కలిగిందన్నారు. గిరిజనులకు మెరుగైన ఆదాయం కల్పించేందుకు వీలుగా 11 వేల ఎరకాల్లో పండ్ల తోటలను పెంచుతున్నామన్నారు. ఐదువేల ఎకరాల్లో సిల్వర్ ఓక్, మూడు వేల ఎకరాల్లో జీడి ,మిగిలిన మూడు వేల ఎకరాల్లో నిమ్మ, దానిమ్మ, బత్తాయి, సపోట పంటలను వేస్తామన్నారు. అవసరమైతే ఐటీడీఏ పీవో అనుమతి తీసుకుని కాఫీ నర్సరీలను కూడా ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు వారి పరిధిలో ఉన్న 50 కుటుంబాలను సందర్శించి అవసరమైన వారికి సేవలను సక్రమంగా , సత్వరమే అందజేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం అమలులో కొయ్యూరు మండలం జిల్లాలో నాలుగో స్థానంలో ఉందన్నారు. సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యల తీసుకుంటామన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో లాలం సీతయ్య, ఏపీవోలు శంకర్, రాజు, వీఆర్‌పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు .

రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలు



చాపరాయి మలుపు వద్ద ఢీకొన్న కార్లు

అనంతగిరి : అనంతగిరి చాపరాయి సమీపంలోని మలుపు వద్ద బుధవారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు అందించిన వివరాలివి. అరకు అందాలు తిలకించడానికి వెళ్తున్న పర్యాటకులు దారిలో ప్రమాదానికి గురయ్యారు. చాపరాయి సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొనడంతో కర్నూల్‌కు చెందిన కె.అభిలాస్(26), టి.దినేష్(24), పి.రమణ(25) తీవ్రంగా గాయపడ్డారు. ఎం.సతీష్(40), సుందర్ (32) స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని అనంతగిరి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవల కోసం ఎస్‌కోట సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలిసికట్టుగా గంజాయిని నిర్మూలిద్దాం

చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్

సీలేరు: ప్రజల జీవితాలను నాశనం చేసే గంజాయి, ఇతర మత్తు పదార్థాలను కలిసికట్టుగా నిర్మూలిద్దామని చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్ పిలుపునిచ్చారు. బుధవారం ధారకొండలో వ్యవసాయ, పోలీసు శాఖలు సంయుక్తంగా గిరి రైతులకు జీడిమామిడి, నిమ్మ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రశాంతమైన గిరిజన గ్రామాల్లో గంజాయి పెంపకం, రవాణా చీడ పురుగులా మారిందన్నారు. అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యుల వలలో పడి జైలు పాలు అవుతున్నారన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో చాలా మంది గిరిజనులు గంజాయి సాగును స్వచ్ఛందంగా విరమించడం ఆనందంగా ఉందన్నారు. వాటి స్థానంలో ఇతర పంటలు సాగు చేసుకోవాలని ఇందుకు అవసరమైన సహకారాన్ని పోలీసు శాఖ అందిస్తుందన్నారు. సీలేరు పోలీసుస్టేషన్ పరిధిలోని ధారకొండ, దుప్పులవాడ, సీలేరు పరిధిలో మొక్కల పంపిణీ చేసినట్టు ఆయన వివరించారు. జీకే వీధి మండలంలో 84 గ్రామాల్లో 841 మంది గిరిజన రైతులకు 30 వేల జీడి, నిమ్మ మొక్కలను పంపిణీ చేసినట్టు వ్యవసాయ అదనపు ప్రోగ్రాం ఆఫీసర్ సిహెచ్ రామప్రసాద్ తెలిపారు. ప్రతి మొక్క గిరిజన రైతు శ్రద్ధగా పెంచాలని, ఉపాధి హామీ పథకం ద్వారా వీటికి నగదు చెల్లింపులు జరుగుతాయని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ కుమారి, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, తహసీల్దార్ ప్రసాద్, సర్పంచ్ రాజు, ఎంపీటీసీ రామన్న, సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

చెదల మందు తాగిన యువకుడి మృతి



హరికృష్ణ మృతదేహం

రాజవొమ్మంగి : కొండపల్లి గ్రామంలో చెదలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ పరశిక హరికృష్ణ (35) అనే గిరిజన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. స్థానిక అడిషినల్ ఎస్‌ఐ జాన్ కుమార్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. హరికృష్ణ తాగుడుకు బానిసై ఏ పనికి వెళ్లకుండా జీవనం సాగిస్తున్నాడు. అతని తండ్రి గతంలోనే మరణించాడు. జులాయిగా తిరుగుతున్నావు..ఇలా అయితే నీకు పిల్లను ఎవరిస్తారు, అమ్మను చూసుకోవా అంటూ ఇరుగుపొరుగు వారు పదే పదే కామెంట్ చేస్తుండగా తీవ్ర మనస్తాపానికి గురైన హరికృష్ణ ఈనెల 6వ తేదీన ఇంటివద్దనే చెదలమందు తాగాడు. అతనిని కుటుంబీకులు రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించగా వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. అతని పరిస్థితి విషమించడంతో మరణించాడు. పోస్ట్‌మార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఎదిగి వచ్చిన ఒక్కగానొక్క కొడుకు ఈ విధంగా మరణించడంతో తల్లి గైరమ్మ దుఃఖానికి అంతులేకుండా పోయింది.

గంజాయితో ఒకరి అరెస్టు



వివరాలు తెలుపుతున్న సీఐ తాతారావు, ఎస్‌ఐ రామకృష్ణ

కె.కోటపాడు : మండలంలో ఆనందపురం జంక్షన్ వద్ద 22 కిలోల గంజాయితో తమిళనాడుకు చెందిన రాజేష్ కన్నన్ సౌందర్య పాండీ ఎ.కోడూరు పోలీసులకు బుధవారం పట్టుబడ్డాడు. కె.కోటపాడు సర్కిల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ తాతారావు, ఎస్‌ఐ రామకృష్ణ వివరాలు తెలిపారు. ఎస్‌ఐ రామకృష్ణ వాహన తనిఖీల్లో భాగంగా చేతిలో బ్యాగ్‌తో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రాజేష్ కన్నన్ సౌందర్య పాండీని తనిఖీ చేయగా అతని బ్యాగ్‌లో గంజాయిని గుర్తించామని, దీంతో ఆ వ్యక్తిపై కేసును నమోదు చేసి కోర్టులో హాజరు పర్చామని తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

అనకాపల్లిటౌన్ : లక్ష్మీదేవిపేటకు చెందిన జితేంద్ర అజయ్(22) ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. తల్లి నూకరత్నంతో పాటు తమ్ముడు, చెల్లితో కలిసి ఉంటున్నాడని, సమోసాలను రైల్వేస్టేషన్‌ల్లో విక్రయిస్తూ జీవనం సాగుస్తుంటాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో అజయ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై తల్లి నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.

'ఎంతగానో ఆకట్టుకున్నాయి'

- గిరిజన కళాకృతులకు పార్లమెంట్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ ఫిదా
- అరకులోయ సందర్శన



కాఫీ హౌస్‌లో కమిటీ సభ్యులు



హరిత రిసార్ట్స్ వద్ద థింసా నృత్యాలను తిలకిస్తున్న బృందం సభ్యులు

అరకులోయ టౌన్: అరకులోని గిరిజన మ్యూజియం గిరిజన ఆచారాలకు సంబంధించిన కళాకృతులు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని పార్లమెంట్ అఫీషియల్ లాంగ్వేజ్ (హిందీ) ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం హర్యానాకు చెందిన రాజ్యాసభ ఎంపీ రామచందర్‌బంగ్డా నేతృత్వంలో ఆరుగురు ఎంపీలు, ఐఏఎస్ అధికారులతో కూడిన 15 మంది కమిటీ బృందం గిరిజన మ్యూజియం, కాఫీ మ్యూజియంను సందర్శించింది. మ్యూజియం ప్రోగాం మేనేజర్ గణపతినాయుడు గిరిజన మ్యూజియం, ఆచార, సంప్రదాయాలపై కమిటీకి వివరించారు. కాఫీ హౌస్‌లో కాఫీ, కాఫీతో తయారుచేసిన, చాక్లెట్స్, కేకులను రుచి చూశారు. నిర్వాహకులను అభినందించారు. గిరిజన ప్రాంతంలో కాఫీ సాగు దగ్గర నుంచి కాఫీ పంట చేతికి అందేవరకు గిరిజనులు కష్టపడే విధానాన్ని బృందానికి కాఫీ హౌస్ నిర్వాహకులు వివరించారు. కాఫీ హౌస్ నుంచి బొర్రాగుహలకు బయలుదేరే సమయంలోని భారీ వర్షం పడడంతో కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పర్యటనలో నేవీ అధికారులు పాల్గొన్నారు. కమిటీ పర్యటనలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పాడేరు ఏఎస్పీ ధీరజ్ నేతృత్వంలోని అరకు సీఐ రుద్రశేఖర్ ఆధ్వర్యంలోని ఎస్‌ఐ సంతోష్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఆర్‌ఐ దొన్ను పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలో పార్లమెంట్ అఫీషియల్ లాగ్వేంజ్ (హిందీ) ఇంప్లిమెంటేషన్ కమిటీ పర్యటించింది. హరితరిసార్ట్స్‌లో మధ్యాహ్నం భోజనం అనంతరం థింసా నృత్యాలను తిలకించారు. గిరిజన సంప్రదాయం థింసా నృత్యం అద్భుతంగా ఉందంటూ రాజ్యాసభ ఎంపీ రామచందర్‌బంగ్డాతో పాటుగా కమిటీ సభ్యులు కొనియాడారు. కొంతసేపు థింసా నృత్యం చేశారు. అనంతరం అరకులోయ వెళ్లారు.

12 బైక్‌లు స్వాధీనం.. ఒకరి అరెస్టు



బైక్‌ల దొంగతనం వివరాలను తెలియజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా



జి.మాడుగులలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

జి.మాడుగుల: రాష్ట్రంలో పలు జిల్లాల్లో పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగిలించిన ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసి ఒకరిని అరెస్టు చేశారు. స్థానిక పోలీసులు పట్టుకొన్న బైక్‌లను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో బైక్‌ల దొంగతనం వివరాలను ఆయన తెలియజేశారు. జి.మాడుగుల మండలంలో కొత్తపల్లి జలపాతం వద్ద 2022 ఏప్రిల్ 27న నలుగురు వ్యక్తులు గంజాయి రవాణా చేస్తున్నారని పోలీసులకు అందిన సమాచారం మేరకు వారిని విచారించగా బైకుల దొంగతనం విషయం వెలుగులోనికి వచ్చిందని ఆయన తెలిపారు. చింతపల్లి మండలం తమ్మింగుల పంచాయతీ, కొండపల్లి గ్రామానికి చెందిన తాంబెలి శివ అలియాస్ వంశీ, చిన్నబందవీధి ప్రాంతానికి చెంది చంటిలకు నెల్లూరు, గుడివాడలకు చెందిన ఎస్.కె. బాబ్జీ, బత్తుల సాయికిరణ్‌లు ఆయా ప్రాంతాల్లో దొంగలించుకువచ్చిన బైక్‌లకు ఇచ్చి దానికి బదులుగా గంజాయిని తీసుకొని ఆయా ప్రాంతాలకు తరలించి విక్రయించేవారని ఆయన తెలిపారు. 2022 సంవత్సరం జూలై 21న చినబందవీధి ప్రాంతానికి చెందిన చంటిని జి.మాడుగుల పోలీసులు అరెస్టు చేసి విశాఖ జైలుకు పంపారని తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న తాంబెలి శివను బుధవారం పోలీసులు ముందస్తు సమాచారం మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద మాటు వేసి పట్టుకున్నారని తెలిపారు. నిందితుడు శివను విచారించగా నెల్లూరు, గుడివాడలకు చెందిన బాబ్జీ, సాయికిరణ్‌ల నుండి తీసుకొన్న 12 బైక్‌లను అన్నవరం పరిసర ప్రాంత కొండల్లో దాచిపెట్టినట్టు తేలింది. బైక్‌లకు రికార్డులు లేకపోవడం వల్ల విక్రయించడం వీలు కాలేదని వాటిని ఒడిస్సా రాష్ట్రం సిమిలిగుడ స్క్రాప్ షాపులో ఎక్కువ ధరకు అమ్ముకోవడానికి ప్రయత్నాల్లో ఉన్నట్టు శివ తెలిపాడు. శివ వద్ద నుంచి స్వాధీనం చేసుకొన్న 12బైక్‌ల వివరాలు ఆయా పోలీస్‌స్టేషన్‌ల నుంచి వాకబు చేసి సంబంధిత బైక్‌ల యజమానులకు పోలీసులు సమాచారం అందించారు. శివపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు పురోగతికి కృషి చేసిన సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్, ఏఎస్‌ఐ మత్స్యరాజు, హెచ్‌సీలు అప్పలరాజు, అప్పారావు, పీసీలు కిశోర్, సత్యారావు, ఉదయ్, చినబాబు, అప్పలరాజులను జిల్లా ఎస్పీ అభినందించారు.